


# ఏం మనిషి?



హేమ

చూడు "రమ్యా! ఆ చీర కన్నా నీకీ లేత గులాబీరంగు చీర చాలా బాగుంటుంది." ఆమె సమాధానం కోసం చూడకుండా ఆ చీర ప్యాక్ చేయించి బిల్ చెల్లించాడతను.

వాళ్ళనే కుతూహలంగా గమనిస్తున్న "స్వప్న" వాళ్ళు కనుమరుగవడంతో నిట్టూర్పును ఆపుకుంటూ గుట్టలుగా పడి ఉన్న చీరల్లోంచి అనాసక్తిగా ఓ ప్రింటెడ్ జార్జెట్ చీర తీసుకుని బిల్ చెల్లించి షాపుముందు నిలబడి వచ్చేపోయే జనాన్ని పరికిస్తున్న భర్త వద్దకు వచ్చి "వెళదామా!" అంది.

ఆ రాత్రి స్వప్న కంటికి కునుకే రాలేదు. పదేపదే ఆ రోజు షాపులో తెల్ల జరీచీరలో మల్లెపూలతో రమ్యంగా ఉన్న "రమ్య" గుర్తుకు రాసాగింది. ఆమె పేరు "రమ్య" అట-ఎంత చక్కగా ఉంది. పేరులాగే ఆమె జీవితంకూడా రమ్యంగానే ఉన్నట్టుంది. అతను ఆమె భర్త కాబోలు. భార్య కోసం ఎంత చక్కటి చీర సెలెక్ట్ చేశాడు-ఎంత అదృష్టవంతురాలో ఆమె.

తన భర్త పెళ్ళైన ఇన్నేళ్ళనుంచీ కనీసం ఒక్క చీరైనా, పోనీ ఓ మల్లెపూల దండైనా తను అడగకుండా తేలేదు. తనెప్పుడైనా అడిగినా షాపువరకూ తోడువస్తారు. అంతేకాని చీరమాత్రం సెలెక్ట్ చేయరు. ఒక్క చీరలేకాదు. ఇంట్లో ఏ వస్తువు కొనాలన్నా "నీ ఇష్టం" అంటారు. ఏదైనా కొని "బావుందా" అని చూపిస్తే ఓసారి దానివైపు చూసి "బావుంది" అంటారు.

ప్రతి దానికీ "నీ ఇష్టం" అనకుండా "నీకీ రంగు చీర బాగుంటుంది స్వప్నా!" "నీకోసం మల్లెపూలు తెచ్చాను స్వప్నా!" "నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని నీ పుట్టిన రోజుకి ప్రెజెంట్ తెచ్చాను స్వప్నా." "ఈరోజు సినిమాకు వెళ్దాం" లాంటి మాటలు తన భర్తనోటంట తను వినగలదా? ఊహుం. ఇలాంటి చిన్న చిన్న కోర్కెలు తనకుంటాయని, ఆ చిన్న మాటల్లోనే తనకెంతో తృప్తి వుంటుందని ఎప్పుడూ అనుకోరు. అసలు ఆయన తన గురించి ఆలోచిస్తారో లేదో అని కూడా అనుమానమే. "ఛీ ఛీ ఏం మనిషి!"

కళ్ళు గట్టిగా మూసుకుని నిద్రకోసం శతవిధాలా ప్రయత్నిస్తోంది "రమ్య." ఊహుం. కంటిమీదికి కునుకే రాదే! వద్దనుకున్నా ఆ రోజు షాపులో పువ్వుల చీరలో నాజూకుగా ఉన్న "స్వప్న" గుర్తుకు రాసాగింది. "ఏ చీర తీసుకోవాలండీ" అని ఆమె అడిగితే ఆమె భర్త కాబోలు "నీ ఇష్టం స్వప్నా. త్వరగా సెలెక్ట్ చేసుకో" అన్నాడు. ఆమె ఇష్టమే అతని ఇష్టం కాబోలు-ఆమె ఎంత అదృష్టవంతురాలో! అలాంటి స్వతంత్రం తనకెక్కడిది? అన్నీ తనభర్త ఇష్టప్రకారమే. తను పెట్టుకునే బొట్టు దగ్గరినుంచి కట్టుకునే చీర, ఆఖరికి వంటగదిలో టీ కప్పుల దగ్గరినుంచి ఫర్నిచర్‌దాకా అన్నీ ఆయన ఇష్టమే.

తనకు నీలిరంగుచీర ఎంతో ఇష్టం. కాని "ఆ చీరకన్నా నీకు ఇదే బాగుంటుం"దని గులాబీరంగు చీర కొన్నారు. తనకు చామంతులు ఇష్టమైతే ఆయనకు మల్లెపూలు ఇష్టంకాబట్టి అవే పెట్టుకోమంటారు. తనకే రంగు చీర కడితే అదే రంగు బొట్టు పెట్టడం అలవాటు. కాని, స్త్రీలకు ఎర్రరంగు బొట్టే అందం అని అదే పెట్టుకోమంటారు. హుం. తనకూ ఒక మనసుంటుందని, తనకూ ఇష్టాఇష్టాలుంటాయని అసలే అనుకోరు. ఎప్పుడూ కాకపోయినా కొన్నిసార్లయినా "నీ ఇష్టం" అనాలని-అలా అంటే తనకెంతో తృప్తిగా వుంటుందని ఆయనెప్పుడూ అనుకోరు. "ఛీ ఛీ ఏం మనిషి!"

★

